తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 18 - జనవరి 2026 | సంపుటి:3 | సంచిక:230 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# లక్ష్యం ఉన్నతంగా పెట్టుకుని కష్టపడాలి: సీఎం రేవంత్ రెడ్డి

- చిట్టబోయినపల్లిలో ఐఐఐటీకి భూమిపూజ
- విద్యారంగానికే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యం
- ఏడాదిలో భవన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ

**మహబూబ్‌నగర్, (తెలంగాణ ముచ్చట్లు):**

లక్ష్యం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని, దాన్ని సాధించేందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. భాషా నైపుణ్యం, జ్ఞానం పెంపొందించుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలని, నిబద్ధతతో కూడిన విద్యే సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుందని ఆయన ఉద్బోధించారు.

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి: రాంచెందర్ రావు

- సికింద్రాబాద్‌లో విజయ సంకల్ప సమావేశం
- కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తోందని ఆరోపణ
- సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ కార్యకర్తలకు అభినందనలు

**సికింద్రాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన విజయ సంకల్ప సమావేశంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్. రాంచెందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 11 ఏళ్లుగా బీఆర్ఎస్ పాలనలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ తెలంగాణ ప్రజలు మోసపోతూనే ఉన్నారని తీవ్ర విమర్శలు చేశారు. ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న అమృత్, స్వచ్ఛ భారత్ పథకాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు.

మిగతా 2లో..





## నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడం చారిత్రక ఘట్టం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృతజ్ఞతలు
- నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తాం
- రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ తరహా అభివృద్ధి లక్ష్యం

**నల్గొండ, (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రకటించిన సందర్భంగా నల్గొండ ప్రజల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో భాగంగా నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

కార్పొరేషన్ హోదాతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు పొందే అవకాశం లభించిందని మంత్రి తెలిపారు. కేవలం 25 నెలల్లోనే కార్పొరేషన్ హోదాను సాధించడం గర్వకారణమని, గతంతో పోలిస్తే మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయవచ్చని పేర్కొన్నారు.

నల్గొండ అభివృద్ధిలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మిగతా 2లో..

## సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపే ప్రయత్నం తగదు: కేటీఆర్

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రెస్‌మీట్
- ప్రభుత్వ నిర్ణయాలను తుగ్లక్ పాలనతో పోల్చిన వ్యాఖ్యలు
- శాంతియుత పోరాటాన్ని అణిచివేస్తున్నారని విమర్శ



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. చారిత్రకంగా హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలుగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, అలాంటి నగరాల అస్తిత్వాన్ని చెరిపివేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ పాలనతో పోలుస్తూ, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి హామీల అమలును పక్కనపెట్టి పేర్లు, గుర్తులు మార్చడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. టీఎస్ పేరును టీజీగా మార్చడం, తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం, అధికార చిహ్నాల నుంచి చారిత్రక గుర్తులను తొలగించడం వల్ల ప్రజలకు ఏం లాభమో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు.

మిగతా 2లో..



## సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా ఇకపై పోటీ చేయను - జగ్గారెడ్డి

- కాంగ్రెస్ సీనియర్ నేత హాట్ కామెంట్స్
- రాహుల్ గాంధీ ప్రచారం చేసినా ఓటమి బాధ
- సంగారెడ్డిలో ఇక ప్రచారం చేయనని స్పష్టం

**సంగారెడ్డి, (తెలంగాణ ముచ్చట్లు):**

సంగారెడ్డిలో ఇకపై తాను ఎమ్మెల్యేగా పోటీ చేయనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితంలో సంగారెడ్డి అంశం మరిచిపోలేని అనుభవంగా మిగిలిపోయిందని ఆయన అన్నారు.

మిగతా 2లో..

## చెరువుల్లో మట్టిపోసిన వారిపై కఠిన చర్యలు

- అన్ని చెరువుల్లో ఫెన్సింగ్‌కు హైడ్రా కమిషనర్ ఆదేశం
- జూబ్లీహిల్స్‌లో పార్కు ఆక్రమణల తొలగింపు
- చారిత్రక బుల్కాపూర్ నాలా పునరుద్ధరణకు చర్యలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ పరిధుల్లో మట్టిపోసి చెరువుల స్వరూపాన్ని మార్చుతున్న ఘటనలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. చెరువుల్లో మట్టిపోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మట్టిపోసేందుకు అవకాశం లేకుండా అన్ని చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# లక్ష్యం ఉన్నతంగా పెట్టుకుని కష్టపడాలి: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి భూమిపూజ చేసిన అనంతరం ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించడంతో పాటు, విద్యార్థులు ప్రస్తావించిన అంశాలకు స్పందించారు. ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధినే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐఐటీతో పాటు ఇంజినీరింగ్, న్యాయ, వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే యువతకు ప్రధాన పరీక్షలు, ఇంటర్వ్యూల దశల్లో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. విద్యే జీవితాన్ని మార్చగల శక్తి అని, అభివృద్ధి చెందిన పౌరులుగా నిలదొక్కుకోవడానికి చదువు కీలకమని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తు చేసిన సీఎం, 75 ఏళ్ల తర్వాత జిల్లాకు మళ్లీ ఆ అవకాశం దక్కిందన్నారు. ఈ రోజు భూమిపూజ చేసిన ఐఐఐటీ భవన నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. రూ.200 కోట్లతో నిర్మించే ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు మల్లు రవి, అరుణ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా ఇకపై పోటీ చేయను - జగ్గారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, తన కోసం రాహుల్ గాంధీ స్వయంగా సంగారెడ్డికి వచ్చి ప్రచారం చేసినప్పటికీ తనను అక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ భుజంపై చేయి వేసి తనను గెలిపించాలని కోరినా ఫలితం రాలేదని చెప్పారు. రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి అవమానించినట్టే అయ్యానేమోనని కూడా తాను ఫీల్ అయ్యానని తెలిపారు. తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని, ఇక్కడి మేధావులు, పెద్దలే కారణమని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఓటమి తన జీవితంలో ఎప్పటికీ మరిచి పోలేనిదని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో సంగారెడ్డిలో తన భార్య నిర్మలా పోటీ చేసినా తాను ప్రచారానికి రానని జగ్గారెడ్డి తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తానని, కానీ సంగారెడ్డిలో మాత్రం ఇకపై ప్రచారం చేయనని ఆయన స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి: రాంచెందర్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల నిధులతో, ములుగు విశ్వవిద్యాలయం వంటి అభివృద్ధి వరాలతో రాష్ట్రాన్ని ఆదుకుంటుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని స్పష్టం చేశారు.

రానున్న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకుని బీజేపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని రాంచెందర్ రావు పిలుపునిచ్చారు. ప్రతి వార్డు, ప్రతి మున్సిపాలిటీలో బీజేపీ బలంగా ముందుకు వెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పరిమితి స్థానాల్లో పోటీ చేసి విజయాలు సాధించిన బీజేపీ కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ విజయాలు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి శుభసూచకమని పేర్కొంటూ, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.







# చెరువుల్లో మట్టిపోసిన వారిపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

మట్టిపోసిన వారితోనే వెంటనే తొలగింపజేసి, వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధుల్లో మట్టిపోస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, గండిపేట చెరువులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసిన ప్రాంతాన్ని స్థానికులు చూపించడంతో, సంబంధిత వ్యక్తి రాజు యాదవ్‌ను వెంటనే మట్టిని తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గండిపేట చెరువులో హిమాయత్‌నగర్ వైపు మట్టిపోసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, డా. ఖుర్షీద్‌ను 48 గంటల్లో మట్టిని తొలగించాలని ఆదేశించారు. గడువు కోరడంతో మరో 24 గంటల సమయం ఇచ్చారు. చెరువుల స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-36 పరిధిలోని రోడ్ నంబర్ 32లో రెండు ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న పార్కులో జరిగిన ఆక్రమణలను హైడ్రా, జీహెచ్ఎంసీ కలిసి తొలగించాయి. పార్కులో అక్రమ నిర్మాణాలపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కుకు ఆనుకుని ఉన్న ఇళ్లవారు వాచ్‌మన్, పశువుల కోసం వేసిన షెడ్లు, పార్కులో ఏర్పాటు చేసిన గేట్లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించి ప్రహరీ నిర్మించాలని, ప్రధాన గేట్ ఏర్పాటు చేసి ప్రజలందరికీ పార్కు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆక్రమణల తొలగింపుతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీటిని తీసుకెళ్లే చారిత్రక బుల్కాపూర్ నాలాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. శంకరపల్లి బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలిచౌకి, పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు నీరు చేరే ఈ నాలా పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. నాలా ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపే ప్రయత్నం తగదు: కేటీఆర్






(మొదటి పేజీ తరువాయి)

గతంలో వికేంద్రీకరణ విధానంతో కొత్త గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల దగ్గరకు తీసుకువచ్చిన దృష్టిని గుర్తు చేస్తూ, హైదరాబాద్‌లో కూడా వార్డులు, జోన్లు పెంచి అభివృద్ధి నిధులు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. అయితే ప్రస్తుతం రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, రోడ్డు వేయలేదని, ఇల్లు కట్టలేదని ఆరోపించారు.

సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని ప్రజలు శాంతియుత ర్యాలీ చేపట్టినప్పటికీ అనుమతులు రద్దు చేసి వేలాది మందిని అరెస్టు చేయడం అరాచకమని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే హక్కును వినియోగించుకుంటూ కోర్టును ఆశ్రయించి పోరాటం కొనసాగిస్తామని, తిరిగి తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడం చారిత్రక ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)



రూ.700 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం, ధర్వేశిపురం వరకు ఆరు లైన్ల రహదారి, బ్రహ్మగారి గుట్ట-లతీఫ్ సాబ్ దర్గా గుట్ట అభివృద్ధి, దొరేపల్లి-అనంతారం రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అలాగే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేయడం, ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్‌కు రూ.450 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

రాజకీయాలకు అతీతంగా నల్గొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శాంతి, సమరస్యంతో కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొడంగల్‌లో కాంగ్రెస్‌కు షాక్

- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు
- కేటీఆర్ సమక్షంలో పార్టీలోకి నాయకులు, కార్యకర్తలు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో, కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నుంచి సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలోకి చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వం పట్ల విశ్వాసంతోనే ప్రజలు పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ బలపడుతుండటం, కాంగ్రెస్ నుంచి వరుసగా చేరికలు జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.





# ముమ్మరంగా మినీ సమ్మక్క-సారలమ్మ జాతరల ఏర్పాట్లు

- 6 జాతరలకు హైమాస్ లైట్లు మంజూరు
- జాతరలోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని మినీ సమ్మక్క-సారలమ్మ జాతరల ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీన స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాతర ఏర్పాట్లపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా అధికారులతో పాటు జాతర కమిటీ సభ్యులు, సర్పంచులతో చర్చించారు.

జాతర ప్రాంతాల్లో ఫార్మేషన్ రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, పారిశుధ్య పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్ మండలంలోని జిట్టేగూడెం, ఇప్పగూడెం గ్రామాలు, చిల్పూర్ మండలంలోని గార్లగడ్డ తండ, లింగంపల్లి, శ్రీపతిపల్లి, చిల్పూర్ మినీ సమ్మక్క-సారలమ్మ జాతరలకు ఎంపీ నిధుల ద్వారా హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ఇచ్చిన హామీ మేరకు ఆరు జాతరలకు రూ.9 లక్షల వ్యయంతో ఆరు హైమాస్ లైట్లను మంజూరు చేశారు. ఈ లైట్లను జాతర ప్రారంభానికి ముందే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు, జాతర కమిటీలకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ నెల 25వ తేదీలోపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.






# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

- రిక్వెల్ ఫోర్డ్ స్కూల్లో వ్యాసరచన పోటీ

**కీసర, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా, తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" కార్యక్రమంలో భాగంగా, కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం రాంపల్లి గ్రామంలోని రిక్వెల్ ఫోర్డ్ స్కూల్ లో వ్యాసరచన పోటీ నిర్వహించారు.ఈ పోటీలో హైస్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వ్యాసరచనకు "ఒక చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన ఒక ప్రాణాన్ని అంతం చేయగలదు","రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత"అనే అంశాలను విద్యార్థులకు నిర్దేశించారు.ఈ సందర్భంగా కీసర పోలీసులు విద్యార్థులతో మాట్లాడుతూ,హెల్మెట్ ధరించడం,సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అలాగే తప్పుదారి డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ద్వారా కుటుంబ స్థాయిలో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు కీసర పోలీసు సిబ్బంది హాజరై సహకరించారు.ఈ సందర్భంగా కీసర పోలీసులు మాట్లాడుతూ, రోడ్డు భద్రతను ప్రజా ఉద్యమంగా మార్చడమే "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" ముఖ్య లక్ష్యమని, విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను తాము పాటించడంతో పాటు, ఇతరులను కూడా పాటించేలా ప్రేరేపించాలని పిలుపునిచ్చారు.






# ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, జనవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్ రూట్, వీఐపీ పార్కింగ్ స్థలాలు, బారికేడ్లు తదితర భద్రతాపరమైన ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై ఖమ్మం టౌన్ పరిధిలోని సప్తపధి ఫంక్షన్ హాల్లో, రూరల్ డివిజన్ పరిధిలో బ్రీఫింగ్ నిర్వహించి పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగిసే వరకు ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలంటూ సీపీ సూచించారు. మద్దులపల్లి హెలిప్యాడ్, ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గం, సభ వేదిక ప్రాంతాల పరిసరాలు, అలాగే రూట్ బందోబస్త్ విధులు నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ వచ్చే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బంది సమయస్ఫూర్తితో, క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమానికి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం హెలిప్యాడ్ నుండి ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమ ప్రాంతం వరకు కాన్వాయ్ రిహార్సల్స్ ను నిర్వహించారు. సీఎం కాన్వాయ్ రూట్లో ట్రాఫిక్ సమస్య లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

# ఒమేగా డిగ్రీ కాలేజ్ ఫర్ విమెన్‌లో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం





- "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026"లో భాగంగా కుషాయిగూడ పోలీసుల నిర్వహణ

**కుషాయిగూడ, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" కార్యక్రమంలో భాగంగా శనివారం కుషాయిగూడ పోలీసులు ఒమేగా డిగ్రీ కాలేజ్ ఫర్ విమెన్‌లో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వై. వెంకట్ రెడ్డి విద్యార్థినులతో మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ అవగాహన, ట్రాఫిక్ నిబంధనలు, సేఫ్ డ్రైవింగ్ విధానాలు, అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది విద్యార్థినులు పాల్గొని, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సే రైటింగ్ మరియు క్విజ్ పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. విజేతలకు చిరు కానుకలు అందజేశారు.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుషాయిగూడ పీఎస్ ఎస్ఐ కే. సతీష్ మరియు సిబ్బంది, పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న రోజువారీ రోడ్డు ప్రమాద కేసులు, వాటికి వర్తించే చట్టపరమైన సెక్షన్ల గురించి విద్యార్థినులకు వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థినుల్లో రోడ్డు భద్రతపై స్పష్టమైన అవగాహన కల్పించిందని నిర్వాహకులు తెలిపారు.

# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం



- పుష్పగుచ్చంతో స్వాగతించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు

**ఖమ్మం బ్యూరో, జనవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు శనివారం ఖమ్మం వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డికి టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు, పలువురు జర్నలిస్టులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా సిపిఐ కార్యాలయం గిరి ప్రసాద్ భవన్ వద్ద పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా నాయకులు వనం వెంకటేశ్వర్లు, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, జిల్లా నాయకులు తాళ్లూరి మురళీకృష్ణ, ఏగినాటి మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు, పసుపులేటి సత్యనారాయణ, ఈనాడు వెంకటేశ్వర్లు, చెరుకూరి గోపాలరావు, రాఘవరావు, రామారావు, రాము, వేదగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్పీ



- ప్రతి బీసీ బిడ్డకు బి-ఫామ్ హామీ
- మల్లన్న పుట్టినరోజు సందర్భంగా ఆస్పత్రిలో పేషెంట్లకు బ్రెడ్ పండ్ల పంపిణీ

**కొత్తకోట,జనవరి17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో బీసీల రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) పుట్టుకే ఒక చరిత్ర అని జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్ (జిఆర్‌కే) పేర్కొన్నారు. బీసీల కోసం పురుడు పోసుకొని పుట్టిన ఈ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు.వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుట్టినరోజు సందర్భంగా పేషెంట్లకు బ్రెడ్ పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జి.రవికుమార్ మాట్లాడుతూ..తెలంగాణ సమాజంలో సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పంతో మేమెంతో మాకు అంత అనే నినాదంతో బీసీల కోసం పుట్టిన పార్టీ టీఆర్పీ అని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ బరిలో నిలుస్తుందని, పోటీ చేసే ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థికి పార్టీ తరపున బిఫామ్‌లు అందజేస్తామని హామీ ఇచ్చారు.జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి అణగారిన వర్గాల రాజ్యాధికారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ గుర్తు 'కత్తెర'తో ఈ దోపిడీదారుల తోకలు కట్ చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.ఇకపై బీసీలపై అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీసీల్లో భారీ స్థాయిలో చైతన్యం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యాధికారులు,సిబ్బంది, టీఆర్పీ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ కర్ణాకర్, ఆత్మకూర్ యూత్ అధ్యక్షులు బొజ్జ మహేష్, టైలర్ మన్యం తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

**ఖమ్మం బ్యూరో,జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** కూసుమంచిలో గిరిజన బాలుర హాస్టల్ నందు గిరిజన సంక్షేమ శాఖ, ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారులకు మరియు ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి నారీ విజయలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాలలో నిర్వహించాల్సిన రికార్డుల ప్రాముఖ్యత, నిబంధనల ప్రకారం నిర్వహణ విధానం, పర్యవేక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కలిగి ఉండాలని, త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ వసతి గృహాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా, సక్రమంగా అమలు చేయాలని, భోజన నాణ్యత, పోషక విలువలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తదనంతరం రికార్డుల నిర్వహణపై నిపుణులచే శిక్షణ ఇప్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏటీడీవో సత్యవతి, వైరా ఐటీడీవో ఏసీఎంఓ స్థానిక వసతి గృహ సంక్షేమ అధికారి కే తిరుపతి రావు,గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎంపిఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం






- **పరమేశ్వర్ రెడ్డి టాస్ వేస్తూ అధికారిక ప్రారంభం**
- **క్రీడాకారుల్లో ఉత్సాహం, మానసిక ఉల్లాసం పెంపొందించడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు అవసరం**

**రామాంతపూర్, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం రామాంతపూర్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ రఫిక్ ఆధ్వర్యంలో రామాంతపూర్ చిన్న చెరువు వద్ద నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, టాస్ వేస్తూ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి క్రీడా పోటీలు క్రీడాకారుల్లో మానసిక ఉల్లాసం మరియు ఉత్సాహాన్ని నింపడంలో కీలకంగా ఉంటాయని అన్నారు. రఫిక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆయన అభినందనలు తెలిపారు.పరమేశ్వర్ రెడ్డి , గత ప్రభుత్వంలో క్రీడలకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీ ద్వారా గ్రామీణ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి క్రీడాకారుడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: మొహ్మద్ తోఫిక్, మహమ్మద్ రఫీక్, ఆకారపు అరుణ్, కంది శ్రవణ్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, గరిక సుధాకర్, నామ్ రాజిరెడ్డి, అంగాల సందీప్, పూస సత్తయ్య, గంగపుత్ర భాస్కర్, మొగిలి లింగం, బుల్లెట్ అశోక్, సందీప్, భాస్కర్, మీట్టు, జిల్లు, సత్తిరెడ్డి, వజీర్ బాబా, సాయి, శాగా శ్రీధర్, అంబికా మహేష్, సూర్య, ఐకాన్ మధు, స్వామి, మొహమ్మద్ జాంగిర్, చిన్న, కాషామల్లా శంకర్, కిషోర్, గాదె రఘు, పాషా, నర్సింగరావు, నయీమ్, రవి స్థానికులు అన్నారు, ఈ టోర్నమెంట్ ద్వారా యువతలో క్రీడాప్రతిభను అభివృద్ధి చేయడంలో, క్రీడాకారుల ఉత్సాహాన్ని పెంపొందించడంలో ఇది పెద్ద ప్రేరణగా ఉంటుందని భావిస్తున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు...





- **రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, జనవరి -17(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
శనివారం రాత్రి మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జనవరి 18న జరుగనున్న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, పైలాన్ ఆవిష్కరణ, నర్సింగ్ కళాశాల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి తప్పులు జరగకుండా ఏర్పాట్లు పూర్తి కావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన లో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర వివిఐపి, వీఐపీలు పాల్గొంటారని తెలిపారు. ఈ తనిఖీలో మంత్రి వెంట ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల





**చిల్కానగర్, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ పరిధిలోని బీరప్ప గడ్డ ప్రాంతంలో సుమారు రూ.95 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆమె వెంట పాల్గొన్నారు.కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల సమయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నిర్మాణ పనుల కారణంగా కాలనీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, డ్యామేజ్ అయిన మంచినీటి పైప్‌లైన్లు, సివరేజ్ పైప్‌లైన్లను వెంటనే మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.రోడ్డు నిర్మాణంలో జాప్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అభివృద్ధి పనులు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ వినీల్ గౌడ్, ఏఈ రాజ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు, బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోకొండ జగన్, కార్యదర్శి పిట్ల రామచందర్, అడ్వైజర్ అడ్వకేట్ జగన్, సోలోమన్, మార్కా శీను, బాలరాజు, గణేష్, జహంగీర్, పండు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# 19న వినియోగానికి పనికిరాని వస్తువుల వేలం..




- **బి.గంగారం,15వ బెటాలియన్ కార్యాలయంలో...**

**సత్తుపల్లి, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలో ఉన్న 15వ బెటాలియన్ పోలీసు ప్రధాన కార్యాలయంలో క్యూ.యం గోదాము మరియు ఎస్.ఎస్ గోదాము చెందిన వినియోగానికి పనికిరాని వస్తువులను ఈ నెల 19న వేలం వేయనున్నట్లు బెటాలియన్ అధికారి ఎన్. పెద్దబాబు తెలిపారు.
ఇనుము, ప్లాస్టిక్, అల్యూమినియం, ఫైబర్ తదితర సామగ్రిని ఉదయం 10 గంటల 30 నిమిషాలకు బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని పాట పాడుకోవచ్చని తెలిపారు. వేలం ముగిసిన వెంటనే నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించి రసీదు తీసుకుని వస్తువులను అక్కడికక్కడే స్వాధీనం చేసుకోవచ్చని వివరించారు. వేలానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8712657544 సంఖ్యను సంప్రదించవచ్చని సూచించారు.

# మల్కాజిగిరిలో 16 ఏళ్ల బాలుడు అదృశ్యం



**మల్కాజిగిరి, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఓల్డ్ మల్కాజిగిరి రామ్ మందిర్ సమీపంలో నివాసముంటున్న ఎంగోలికర్ రాజేష్ తన రెండవ కుమారుడు ఎంగోలికర్ విగ్నేష్ , (10వ తరగతి విద్యార్థి) అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, జనవరి 16, 2026న చదువు విషయంలో తల్లి మందలించడంతో అదే రోజు మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో విగ్నేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించినా ఎలాంటి సమాచారం లభించలేదని పేర్కొన్నారు.తప్పిపోయిన బాలుడి శారీరక లక్షణాలు: ఎత్తు సుమారు 5.4 అడుగులు, గోధుమ రంగు చర్మం. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలడు. అదృశ్యమైన సమయంలో తెలుపు రంగు టీషర్ట్ మరియు ప్యాంట్ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, క్రైమ్ నెం. 53/2026 కింద దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి ఆచూకీపై ఎలాంటి సమాచారం తెలిసినవారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# జాతీయ స్థాయి ఖో ఖో పోటీలను విజయవంతంగా నిర్వహించాం

- **తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్జం గా రాఘవరెడ్డి**



**కాజీపేట్ జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతిష్టాత్మకమైన 58 వ సీనియర్ జాతీయ ఖో ఖో పోటీలను ఐదు రోజులపాటు విజయవంతంగా నిర్వహించామని తెలంగాణ ఆయిల్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్, తెలంగాణ ఖో ఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేట్ రైల్వే స్టేడియంలో జనవరి 11వ తేదీన దేశం నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారుల తో అట్టహాసంగా ప్రారంభమై 15వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాఘవరెడ్డి మాట్లాడుతూ దేశ స్థాయి క్రీడలు కాజీపేటలో నిర్వహించడం తమకు ఎంతో గర్వకారణం గా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోటీలు విజయవంతం కావడానికి సహాయ సహకారాలు అందించిన మీడియా, ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, క్రీడాభిమానులు, ఇతర శాఖల అధికారులకు ఆయన నిర్వహణ కమిటీ తరపున ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీలకు విశేష ప్రచారం కల్పించి క్రీడాకారుల ప్రతిభను ప్రజలకు చేరువచేసిన మీడియాకు కృషి మరువలేనిది అన్నారు. అలాగే పోటీల నిర్వహణకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించి శాంతియుత వాతావరణంలో పోటీలు జరగడానికి సహకరించిన మున్సిపల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారాలతోనే 58వ సీనియర్ జాతీయ కోకో పోటీలు ఇలాంటి అవాంతరలు లేకుండా విజయవంతముగా పూర్తయ్యాయని భవిష్యత్తులో కూడా ఇలానే క్రీడల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.



# కళతో పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకొస్తున్న కానిస్టేబుల్ విక్రమ్...

- **సిపి సునీల్ దత్ కు పెన్సిల్ స్కెచ్ బహుకరించి ప్రశంసలు అందుకున్న దాసరి విక్రమ్..**

**ఖమ్మం బ్యూరో, జనవరి 17(తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే కుంచె చేతబట్టి కళా సౌందర్యాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతిభావంతుడు చింతకాని మండలం గాంధీనగర్ కాలనీకి చెందిన దాసరి విక్రమ్. ప్రస్తుతం పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఐపీఎస్ పట్ల ఉన్న గౌరవంతో ఆయన చిత్రాన్ని పెన్సిల్ స్కెచ్ గా మలిచారు. శుక్రవారం కమిషనరేట్లో సిపిని మర్యాదపూర్వకంగా కలిసి ఆ చిత్రపటాన్ని వారికి బహుకరించారు. కేవలం ఒక చిత్రపటానికి పరిమితం కాకుండా విక్రమ్ తన కళా ప్రతిభను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక పోలీస్ బెటాలియన్‌లో చాటుకున్నారు. వివిధ బెటాలియన్ల గోడలు, కార్యాలయాల్లో, పోలీసుల త్యాగాలు, సాహసాలు, సామాజిక అంశాలను ప్రతిబింబించేలా ఆయన వేసిన పెయింటింగ్స్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వృత్తి పట్ల నిబద్ధతతో పాటు కళా రంగంలో ఆయన చూపిస్తున్న చొరవను పలువురు కమాండెంట్లు ఇప్పటికే ప్రశంసించారు. తన శాఖలో ఇంతటి గొప్ప కళాకారులు ఉండటంపై సిపి సునీల్ దత్ హర్షం వ్యక్తం చేశారు. విక్రమ్ గీసిన పెన్సిల్స్ స్కెచ్ను చూసి అభినందించడమే కాకుండా భవిష్యత్తులో కూడా తన కళ ద్వారా పోలీస్ శాఖకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

స్టేషన్ ఘనపూర్, జనవరి 17: స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) డి.ఎస్. వెంకన్న గురువారం తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రజలకు సమాజంలో జరుగుతున్న విషయాలను నిజాయితీగా, బాధ్యతాయుతంగా తెలియజేయడంలో పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు, పాల్గొన్నారు.



## కాప్రా బంజారా కాలనీలో మురుగు నీటి సమస్యకు పరిష్కారం

- వైస్ చైర్మన్ విఠల్ నాయక్ చొరవతో సమస్య నివారణ

**కాప్రా, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా నాయక్‌నగర్ బంజారా (ఎస్టీ) కాలనీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌స్‌లో మురుగు నీరు నిండిపోవడంతో రోడ్లపైకి పొంగిపొర్లి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు.సంబంధిత హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి (హైదరాబాద్ వాటర్ బోర్డు) అధికారులకు సమాచారం అందించి, మురుగు శుభ్రపరిచే వాహనాన్ని కాలనీలోకి రప్పించి సిబ్బందితో కలిసి మ్యాన్‌హోల్‌స్‌ను శుభ్రం చేయించారు. దీంతో రోడ్లపై నిలిచిన మురుగు నీరు తొలగిపోవడంతో పాటు దుర్వాసన సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది. మురుగు నీరు ఇళ్లలోకి ప్రవేశించి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న సమయంలో వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, విఠల్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా విఠల్ నాయక్‌ను కాలనీవాసులు అభినందించారు.



## కామ్రేడ్ జ్యోతి బసు 16వ వర్ధంతి సభ

**కాప్రా, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, స్వాతంత్ర్య పోరాటయోధుడు కామ్రేడ్ జ్యోతి బసు 16వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జ్యోతి బసు చిత్రపటానికి జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు జి. శ్రీనివాసులు, సీనియర్ నాయకులు వీరస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గౌడుగు యాదగిరి రావు అధ్యక్షతన సభ నిర్వహించారు.సభలో మాట్లాడిన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. శ్రీనివాసులు మాట్లాడుతూ కామ్రేడ్ జ్యోతి బసు లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడయ్యారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న ఆయన, సీపీఐ(ఎం) పార్టీ 'నవరత్నాలలో' ఒకరిగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో భూసంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసి, రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని చెప్పారు. దాదాపు ఐదు పర్యాయాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన జ్యోతి బసు, హల్దియా పెట్రో కెమికల్స్ వంటి భారీ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చారని వివరించారు.పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేసి, మూడు అంచెల విధానంలో ఎన్నికలు నిర్వహించి స్థానిక సంస్థలకు అధికారాలు అప్పగించారని అన్నారు. నిడారంబరత, నిష్పక్షపాత పరిపాలన ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. 1996లో నేషనల్ ఫ్రంట్ నాయకత్వం జ్యోతి బసును దేశ ప్రధానమంత్రిగా కోరినప్పటికీ, సీపీఐ (ఎం) అఖిల భారత కమిటీ నిర్ణయం మేరకు ఆ బాధ్యతను సున్నితంగా తిరస్కరించిన మహోన్నత నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని తెలిపారు. అలాగే 85వ ఏట అనారోగ్య కారణాలతో ముఖ్యమంత్రి పదవిని స్వచ్ఛందంగా వీడటం ద్వారా ఉన్నత రాజకీయ విలువలకు నిదర్శనంగా నిలిచారని అన్నారు. కార్మిక, కర్షక ఉద్యమాలకు అండగా నిలిచిన జ్యోతి బసు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. శ్రీనివాస్, నాయకులు ఉన్ని కృష్ణ, శివనారాయణ, శోభ, గౌసీయ, ఉదయ భాస్కర్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.





# దమ్మపేట అభివృద్ధే లక్ష్యం.!

## మంత్రి తుమ్మల

అశ్వారావుపేట, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు): దమ్మపేట మండలాన్ని అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లిలో శనివారం ఆయనను బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు ధారా యుగంధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధారా యుగంధర్ మంత్రి తుమ్మలను శాలువాతో సన్మానించారు. అనంతరం దమ్మపేట మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను వినతి పత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వినతులకు స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వపరంగా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో దమ్మపేట మండలం రాష్ట్రంలో ముందుండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.





# మల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అధికారులను కోరారు. "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ మల్లాపూర్ ప్రాంతంలో జల మండలి శాఖ ఏఈ సిరాజ్, విద్యుత్ శాఖ ఏఈ విజయతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు బస్తీలు, కాలనీలను సందర్శించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పెండింగ్ పనులపై అధికారులకు వివరించగా, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.దీనిపై స్పందించిన జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, అతి త్వరలో పెండింగ్ పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలమండలి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# జడ్పీహెచ్ఎస్ నాగారం పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**నాగారం, జనవరి17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" ట్రాఫిక్ మాస ఉత్సవాలు సందర్భంగా నాగారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జవహర్ నగర్ ట్రాఫిక్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్, హెల్మెట్ వినియోగం, వాహన నిబంధనలు వంటి అంశాలపై వివరించారు.అలాగే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ట్రాఫిక్ అంశంపై డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీసీ రాములు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ట్రాఫిక్ నియమాలను చిన్ననాటి నుంచే అలవర్చుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మహమ్మద్ అండాలి ఆశయాలను కొనసాగించాలి

- సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు

**ఏఎస్ రావు నగర్ , జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఈసీఐఎల్ పరిశ్రమలో సీఐటీయూ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడంలో మహమ్మద్ అండాలి విశేష కృషి చేశారని, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటాలు ప్రతి కార్యకర్తకు ఆదర్శమని సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు అన్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అండాలి ప్రథమ వర్ధంతి సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని వారి నివాసంలో



శనివారం నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీపీఎం కాప్రా సర్కిల్ కమిటీ కార్యదర్శి జి. శ్రీనివాసులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా డీజీ నర్సింహారావు మాట్లాడుతూ, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు తీవ్ర ఆందోళనకరంగా మారాయని అన్నారు. వెనిజులా దేశంపై సామ్రాజ్యవాద శక్తుల దాడులు ప్రపంచ ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతున్నాయని విమర్శించారు. అలాగే దేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల పని గంటలు పెరగడం, ఉద్యోగ భద్రత దెబ్బతినడం, సంక్షేమ హక్కులపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.కమ్యూనిస్టు శక్తుల ఐక్యత అవసరమని, ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక ఉద్యమం బలోపేతం అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. మహమ్మద్ అండాలి తన జీవితాన్ని పూర్తిగా కార్మిక ఉద్యమం, శాస్త్రీయ దృక్పథం వ్యాప్తికి అంకితం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం, సీఐటీయూ, సీపీఎం నాయకులు మరియు సైన్స్ రంగం ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు లాటరీ ద్వారా ఖరారు

- మహిళా రిజర్వేషన్లను ప్రకటించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో త్వరలో జరగనున్న ఎల్లంపేట్,మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డు వారీ రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ మను చౌదరి లాటరీ విధానంలో ఖరారు చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియలతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా లాటరీ విధానంలో నిర్వహించారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో 24 వార్డులు, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 24 వార్డులు, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను ఎస్‌టి, ఎస్‌సి, బీసి, మహిళల రిజర్వేషన్లను ప్రణాళికా శాఖ ఆమోదించిన సోషియో-ఎకనామిక్-ఎడ్యుకేషన్-ఎంప్లాయ్‌మెంట్-పోలిటికల్-కాస్ట్ (ఎస్ఈఈపీసీ) సర్వే-2024 ఆధారంగా ఖరారు చేశారు.ఈ రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్‌ను త్వరలో విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బుల్లెట్ బైక్ స్కిడ్... ఒకరికి గాయాలు



**సత్తుపల్లి, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండల పరిధిలోని బుగ్గపాడు రేగళ్లపాడు గ్రామాల మధ్య శనివారం బుల్లెట్ బైక్ ప్రమాదం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ఐకా మిథున్ సత్య (24) మరియు కొత్తగూడెం నివాసి రాజ్ కిరణ్ ఒకే బైక్‌పై భీమడోలు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తుండగా, బుగ్గపాడు దాటిన అనంతరం బైక్ స్కిడ్ అయి పడిపోయింది.

ఈ ఘటనలో మిథున్ సత్యకు తీవ్ర గాయాలు కాగా, సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈఎంటి గొల్లమందల కృష్ణ, పైలట్ రాధాకృష్ణ గాయపడిన మిథున్ సత్యకు అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. గాయాలకు కట్లు కట్టి, స్ప్లింటింగ్ చేయడంతో పాటు ఆక్సిజన్, సెలైన్ బాటిల్, అవసరమైన ఇంజెక్షన్లు అందించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడిన సత్తుపల్లి 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. అలాగే ఖమ్మం జిల్లా 108 సర్వీస్ మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ గారు కూడా సిబ్బందిని ప్రశంసించారు.

# లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే
## పైరవీదారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి,జనవరి17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణం, వనపర్తి మండలం, పెబ్బేరు పట్టణం మరియు పెబ్బేరు మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి శనివారం చెక్కులను పంపిణీ చేశారు.వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన,వనపర్తి పట్టణం మరియు మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు, అలాగే పెబ్బేరు పట్టణం మరియు మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ విధంగా మొత్తం 72 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు గానీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు గానీ పొందేందుకు పైరవీదారులను నమ్మి మోసపోవద్దని లబ్ధిదారులకు సూచించారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, వనపర్తి మండలం మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం.. సర్పంచ్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం



**అడ్డాకల్,జనవరి17(తెలంగాణ ముచ్చట్లు):**మహబూబ్నగర్ జిల్లా అడ్డాకల్ మండలంలోని బలీదుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు వార్డులకు సంబంధించిన సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా సర్పంచ్ స్పష్టం చేశారు.సమావేశంలో విద్య, వైద్యం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, తాగునీటి సౌకర్యం, వ్యవసాయ అభివృద్ధి, మహిళా సంఘానికి నూతన భవనం ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయా వార్డు సభ్యుల దృష్టికి తీసుకురావాలని, వాటిపై తక్షణమే స్పందించి పనులు చేపడతామని సమావేశంలో తీర్మానం చేశారు.గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సమన్వయం ఎంతో అవసరమని సర్పంచ్ కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఉప సర్పంచ్ రాధా శివ, వార్డు సభ్యులు మంగరాయి భార్గవి, వెంకటేష్, వై. ఆంజనేయులు, సూగుర్రాములు, ఎండి.రసూల్, మామిళ్ల శ్రీనివాస్, శిరీష కురుమూర్తి, మంద కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ చేరుకున్న భారత నౌకాదళ తొలి శిక్షణా దళం

- చాంగీ నావల్ బేస్‌లో నౌకల రాక
- దక్షిణ తూర్పు హిందూ మహాసముద్ర ప్రాంతంలో శిక్షణా మోహరింపు
- నౌకాదళ శిక్షణలో భాగంగా అంతర్జాతీయ ప్రయాణం



భారత నౌకాదళానికి చెందిన తొలి శిక్షణా దళం జనవరి 15న సింగపూర్‌లోని చాంగీ నావల్ బేస్‌కు చేరుకుంది. ఈ శిక్షణా దళంలో ఐఎన్ఎస్ తిర్, ఐఎన్ఎస్ శార్దూల్, ఐఎన్ఎస్ సుజాత నౌకలతో పాటు భారత తీర రక్షక దళానికి చెందిన ఐసీజీఎస్ సారథి నౌక ఉన్నాయి. దక్షిణ తూర్పు హిందూ మహాసముద్ర ప్రాంతంలో శిక్షణా మోహరింపులో భాగంగా ఈ దళం సముద్ర ప్రయాణం చేపట్టింది. యువ నావికాధికారులకు సముద్ర ప్రయాణ అనుభవం, నావిగేషన్ నైపుణ్యాలు, సముద్ర భద్రతపై ప్రాయోగిక శిక్షణ అందించడం ఈ మోహరింపుకు ప్రధాన ఉద్దేశ్యం.

ఈ శిక్షణా ప్రయాణం ద్వారా ప్రాంతీయ సముద్ర భద్రతకు భారత నౌకాదళం కట్టుబాటును మరింత బలపరుస్తోంది. ఇతర దేశాల నౌకాదళాలతో పరస్పర అవగాహన, సహకారాన్ని పెంపొందించుకోవడం కూడా ఈ మోహరింపులో కీలక అంశంగా ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రతను పరిరక్షించడంలో భారత నౌకాదళం పోషిస్తున్న పాత్రను ఈ శిక్షణా దళం మోహరింపు స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

# మల్లాపూర్ డివిజన్‌లో తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ఆవిష్కరణ



**మల్లాపూర్, జనవరి 17 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ పరిధిలో గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ముచ్చట్లు ప్రజల సమస్యలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజల స్వరం ప్రభుత్వానికి చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పరస్పర శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ ముచ్చట్లు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# డాక్టర్ మాధవరెడ్డి సేవలు చిరస్మరణీయం డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



- 77వ జయంతి సందర్భంగా వనపర్తిలో డాక్టర్ మాధవరెడ్డి విగ్రహావిష్కరణ

**వనపర్తి,జనవరి17(తెలంగాణ ముచ్చట్లు):** ఉస్మానియా హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు, పేదల వైద్యుడిగా పేరుగాంచిన డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి సేవలు వనపర్తి ప్రజలు ఎప్పటికీ మరువలేనివని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు.డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి 77వ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలో జయన్న తిరుమలాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆవిష్కరించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ... అతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తన అన్న మాధవరెడ్డి కష్టపడి చదివి వైద్యుడిగా ఎదిగి పేద ప్రజలకు అంకితభావంతో సేవలందించారని తెలిపారు.వనపర్తి పట్టణంలో ప్రతి ఆదివారం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమన్నారు.గత సంవత్సరం మార్చి 2న వనపర్తిలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి పేరును ఖరారు చేయడం ఆయన సేవలకు దక్కిన అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు. వైద్య రంగంలో మాధవ రెడ్డి గారు వనపర్తికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆ సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కోర్టు ప్లీడర్ కిరణ్ కుమార్, రాష్ట్ర మైనారిటీ నాయకులు కమర్ మియా, అక్తర్, వనపర్తి జిల్లా మైనారిటీ అధ్యక్షులు సమద్ మియా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, ఏఐపీసీ అధ్యక్షుడు నాగార్జున, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు జయన్న తిరుమలాపురం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రపంచ మతాల దినోత్సవం

# మతాల సారాంశం మానవత్వమే

- విభేదాల రాజకీయాలకు చెక్ అవసరం
- ఐక్యతే శాశ్వత శాంతికి మార్గం



ప్రపంచ మతాల దినోత్సవం అనేది కేవలం ఒక క్యాలెండర్‌లో గుర్తించే రోజు మాత్రమే కాదు; అది మానవ సమాజం తనను తాను ప్రశ్నించుకోవాల్సిన సందర్భం. ప్రపంచంలో ఉన్న అనేక మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు వేర్వేరుగా కనిపించినా, వాటి మూల తత్వం మాత్రం ఒక్కటే — మానవత్వం. ప్రేమ, కరుణ, దయ, సత్యం, శాంతి వంటి విలువలను అన్ని మతాలు ఏదో ఒక రూపంలో బోధిస్తాయి. అయినా నేటి సమాజంలో మతం ఐక్యతకు బదులు విభజనకు కారణమవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మతాల దినోత్సవం ప్రాధాన్యత మరింత పెరుగుతోంది.

చరిత్రను తిరగేస్తే, మతం మానవ నాగరికత ఎదుగుదలలో కీలక పాత్ర పోషించినట్టు స్పష్టంగా తెలుస్తుంది. సమాజానికి నైతిక విలువలు నేర్పడం, వ్యక్తిలో ఆత్మ నియంత్రణ పెంపొందించడం, సమూహ జీవనానికి నియమాలు ఇవ్వడం వంటి అంశాల్లో మతాల పాత్ర అపారమైనది. అయితే కాలక్రమంలో మతాన్ని శక్తి, ఆధిపత్యం, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మొదలైంది. అప్పుడు మతం తన అసలు రూపాన్ని కోల్పోయి, ఘర్షణలకు వేదికగా మారింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక యుద్ధాలు, అల్లర్లు, హింసాత్మక ఘటనలు దీనికి ఉదాహరణలు.

ప్రపంచ మతాల దినోత్సవం మనకు గుర్తు చేయాల్సిన ప్రధాన విషయం ఏమిటంటే — మతాల మధ్య తేడాలు సహజం, కానీ ద్వేషం అనవసరం. ప్రతి మతానికి తనదైన విశ్వాసాలు, ఆచారాలు ఉంటాయి. వాటిని గౌరవించడమే నిజమైన సహజీవనం. ఒకరి ప్రార్థనా విధానం వేరుగా ఉందని, వారి ఆహార అలవాట్లు భిన్నంగా ఉన్నాయని, వారి దేవుని భావన మనదానికి సరిపోదని వారిని శత్రువులుగా చూడటం మత బోధనలకు పూర్తిగా విరుద్ధం. నిజమైన మతం ఎప్పుడూ హింసను, అసహనాన్ని సమర్థించదు.

నేటి కాలంలో మతం రాజకీయాలతో కలిసిపోవడం మరో పెద్ద సమస్యగా మారింది. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి, మతాన్ని ఓటు బ్యాంకుగా మార్చే ప్రయత్నాలు సమాజాన్ని లోపల నుంచే బలహీనపరుస్తున్నాయి. మతాల మధ్య విభేదాలను ప్రోత్సహించడం ద్వారా తాత్కాలిక రాజకీయ లాభాలు సాధించవచ్చేమో కానీ, దీర్ఘకాలంలో అది దేశాల ఏకత్వాన్ని దెబ్బతీస్తుంది. ఒకసారి సమాజంలో అనుమానం, ద్వేషం విత్తనాలు నాటితే, వాటిని తొలగించడం చాలా కష్టం.

భారతదేశం వంటి బహుళ మతాల దేశంలో ఈ అంశం మరింత సున్నితమైనది. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన వంటి అనేక మతాలు శతాబ్దాలుగా కలిసి జీవిస్తున్నాయి. ఈ భిన్నత్వమే భారతదేశ బలంగా నిలిచింది. కానీ అదే భిన్నత్వాన్ని చిచ్చుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మతాల మధ్య ఐక్యతను కాపాడుకోవడం అంటే కేవలం శాంతిని కాపాడుకోవడం మాత్రమే కాదు; దేశ భవిష్యత్తును రక్షించుకోవడం కూడా.

ప్రపంచ మతాల దినోత్సవం యువతకు ఒక ముఖ్యమైన సందేశం ఇస్తుంది. సోషల్ మీడియా యుగంలో అబద్ధాలు, ద్వేషపూరిత ప్రచారం వేగంగా వ్యాపిస్తోంది. మతాల పేరుతో తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా, ప్రశ్నించే దృక్పథం యువతలో పెరగాలి. మతాన్ని వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభూతిగా చూడటం, ఇతరుల విశ్వాసాలను గౌరవించడం నేర్చుకున్నప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

చివరగా, ప్రపంచ మతాల దినోత్సవం మనందరికీ ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది — మతం మనల్ని విడగొట్టడానికి కాదు, కలపడానికి. దేవుడి పేరు వేరైనా, ప్రార్థన విధానం భిన్నమైనా, మనిషి అనే గుర్తింపు ఒక్కటే. ఆ సత్యాన్ని అంగీకరించిన రోజే మతాల మధ్య నిజమైన ఐక్యత సాధ్యమవుతుంది. శాంతి, సహజీవనం, పరస్పర గౌరవం అనే విలువలను ఆచరణలో పెట్టినప్పుడే ఈ దినోత్సవానికి నిజమైన అర్థం లభిస్తుంది.

## విని ది పూ దినోత్సవం

# బాల్యపు కల్పనలకు చిరునామా

- స్నేహానికి, సరళ జీవనానికి ప్రతీక
- పిల్లల సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన పాత్ర



విని ది పూ దినోత్సవం అనేది కేవలం ఒక బాలల కథా పాత్రను స్మరించుకునే రోజు మాత్రమే కాదు; అది బాల్యపు స్వచ్ఛతను, ఊహాశక్తిని, సరళమైన జీవన తత్వాన్ని గుర్తు చేసే ప్రత్యేక సందర్భం. ప్రసిద్ధ బాల సాహిత్య రచయిత ఏ.ఏ. మిల్న్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినాన్ని పాటిస్తారు. ఆయన సృష్టించిన విని ది పూ పాత్ర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది పిల్లలకే కాకుండా పెద్దల మనసులకూ చేరువైంది. కాలం మారినా, తరాలు మారినా ఈ పాత్రపై ఉన్న ప్రేమ మాత్రం తగ్గలేదు.

విని ది పూ కథలు పిల్లల ప్రపంచాన్ని ఒక ప్రత్యేకమైన కలల లోకంలోకి తీసుకెళ్తాయి. అడవిలో నివసించే ఒక చిన్న ఎలుగుబంటి, అతని స్నేహితులు, వారి మధ్య జరిగే సాధారణ సంఘటనలే ఈ కథల సారాంశం. కానీ ఆ సాధారణతలోనే ఒక లోతైన జీవన తత్వం దాగి ఉంటుంది. ఎక్కువ ఆశలు లేకుండా, ఉన్నదానిలో సంతోషం వెతుక్కోవడం, స్నేహాన్ని విలువగా భావించడం, చిన్న విషయాల్లో ఆనందాన్ని చూడటం — ఇవన్నీ విని ది పూ కథలు పిల్లలకు సహజంగా నేర్పిస్తాయి. పిల్లల సాహిత్యంలో విని ది పూ ప్రత్యేకంగా నిలవడానికి కారణం, ఈ కథలు కేవలం వినోదానికే పరిమితం కాకపోవడమే. అవి పిల్లల మానసిక వికాసానికి కూడా దోహదపడతాయి. స్నేహం అంటే ఏమిటి, ఒంటరితనాన్ని ఎలా ఎదుర్కోవాలి, భయం వచ్చినప్పుడు ఎలా ధైర్యంగా ఉండాలి వంటి అంశాలు కథల రూపంలో సున్నితంగా పిల్లల మనసుల్లో నాటబడతాయి. అందుకే ఈ కథలు చదివిన పిల్లలు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరింత సానుకూలంగా చూడగలుగుతారు.

విని ది పూ పాత్ర పెద్దలకు కూడా ఒక పాఠాన్ని నేర్పిస్తుంది. ఆధునిక జీవితంలో ఒత్తిడి, పోటీ, పరుగులు పెరిగిన వేళ, ఈ చిన్న పాత్ర మనల్ని ఆగి ఆలోచించమని చెబుతుంది. జీవితం అంటే ఎప్పుడూ పెద్ద విజయాలే కాదు; ఒక స్నేహితుడితో మాట్లాడటం, ప్రకృతిని ఆస్వాదించడం, మనసుకు నచ్చిన చిన్న ఆనందాలను స్వీకరించడం కూడా జీవన సౌందర్యంలో భాగమేనని గుర్తు చేస్తుంది. అందుకే విని ది పూ కథలు పిల్లలకే కాదు, పెద్దలకూ ఆదరణ పొందుతున్నాయి. డిజిటల్ యుగంలో పిల్లలు తెరలకే పరిమితమవుతున్న ఈ కాలంలో, విని ది పూ వంటి బాల సాహిత్య రచనలు మరింత అవసరంగా మారాయి. ఇవి పిల్లలను పుస్తకాల వైపు ఆకర్షిస్తాయి, వారి ఊహాశక్తిని విస్తరింపజేస్తాయి. కథలు చదవడం ద్వారా భాషా నైపుణ్యాలు పెరుగుతాయి, భావోద్వేగాలను అర్థం చేసుకునే శక్తి మెరుగుపడుతుంది. ఈ దృష్ట్యా విని ది పూ దినోత్సవం పిల్లల పుస్తకాల ప్రాముఖ్యతను కూడా గుర్తు చేసే రోజు.

మొత్తంగా విని ది పూ దినోత్సవం బాల్యపు అమాయకత్వాన్ని, స్నేహపు విలువను, సరళ జీవన సౌందర్యాన్ని గుర్తు చేసే ప్రత్యేక రోజు. పిల్లల ప్రపంచాన్ని వెలిగించిన ఈ పాత్ర, పెద్దల జీవితాలకు కూడా ఒక సాంత్వనగా నిలుస్తోంది. కల్పనకు, మానవ సంబంధాలకు ఎంత ప్రాముఖ్యత ఉందో చెప్పే విని ది పూ కథలు, రాబోయే తరాలకూ అలాగే కొనసాగుతాయనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.



# పశ్చిమ, ఉత్తర సెక్టార్లలో ఫార్వర్డ్ బేస్‌లను పరిశీలించిన ఎయిర్ వైస్ మార్షల్ మన్మీత్ సింగ్

- పరిపాలనా మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష
- కౌంటర్ ఇంటెలిజెన్స్ సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఎయిర్ వారియర్ల సేవలను ప్రశంసించిన సీనియర్ అధికారి

పశ్చిమ, ఉత్తర సెక్టార్లలోని ఫార్వర్డ్ బేస్‌లను వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ సీనియర్ ఆఫీసర్‌ఇన్‌చార్జ్ (అడ్మినిస్ట్రేషన్) ఎయిర్ వైస్ మార్షల్ మాన్మీత్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పరిపాలనా మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఆయన లోతైన సమీక్ష నిర్వహించారు.

ఆపరేషనల్ సస్టైనెన్స్ నిరంతరం కొనసాగేందుకు అవసరమైన సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సున్నితమైన ప్రాంతాలు, క్లిష్టమైన ఆపరేషన్ వాతావరణాల్లో భద్రతా వ్యవస్థలు ఎలా అమలవుతున్నాయన్న అంశాలను సమగ్రంగా పరిశీలించారు.

ఫార్వర్డ్ బేస్‌లలో విధులు నిర్వహిస్తున్న ఎయిర్ వారియర్లు, సహాయక సిబ్బందితో ఎయిర్ వైస్ మార్షల్ మన్మీత్ సింగ్ మమేకమై మాట్లాడారు. వారి వృత్తిపరమైన నైపుణ్యం, ఉన్నత మనోధైర్యాన్ని ప్రశంసించారు. కఠిన పరిస్థితుల్లోనూ వారు చూపుతున్న అంకితభావం ప్రశంసనీయమని తెలిపారు. ఎల్లప్పుడూ అప్రమత్తత, కఠిన భద్రతా ప్రోటోకాల్స్, బలమైన పరిపాలనా మద్దతే ఫార్వర్డ్ ప్రాంతాల్లో మిషన్ రెడినెస్‌ను, సురక్షిత వైమానిక ఆపరేషన్లను నిర్ధారిస్తాయని ఆయన స్పష్టం చేశారు. భారత వైమానిక దళం ఆపరేషనల్ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇవి కీలకమని పేర్కొన్నారు.



# మాజీ ముఖ్యమంత్రి బి.సి. ఖండూరి ఆరోగ్యాన్ని పరామర్శించిన ఉపరాష్ట్రపతి

- డెహ్రాడూన్‌లో ఆత్మీయ భేటీ
- లోక్‌సభ సహచరత్వాన్ని గుర్తుచేసుకున్న ఉపరాష్ట్రపతి
- దేశ రహదారి మౌలిక వసతుల అభివృద్ధిలో ఖండూరి పాత్రకు ప్రశంసలు

భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ డెహ్రాడూన్‌లో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి, మేజర్ జనరల్ (రిటైర్డ్) బి. సి. ఖండూరిను ఆత్మీయంగా కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. లోక్‌సభలో సహచరులుగా కలిసి పనిచేసిన రోజుల్ని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశానికి చేసిన సేవలను ప్రస్తావిస్తూ, ఖండూరి యొక్క సుదీర్ఘ ప్రజాసేవ పట్ల గౌరవాభిమానాలు వ్యక్తం చేశారు. సైనిక సేవలో ఖండూరి చూపిన క్రమశిక్షణ, అంకితభావాన్ని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. అనంతరం దేశ రహదారి మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తించారు. గోల్డెన్ క్వాడ్రిలేటరల్, జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా కనెక్టివిటీ మెరుగుపడటంలో ఖండూరి చేసిన కృషిని కొనియాడారు. ఈ రహదారి ప్రాజెక్టుల వల్ల కోయంబత్తూరు ప్రాంతం సహా పలు ప్రాంతాల్లో ఆర్థిక అభివృద్ధికి ఊతం లభించిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఖండూరి చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్యంలో తగ్గిపోతున్న ప్రజల పాత్ర

- ఓటు హక్కుకే పరిమితమవుతున్న ప్రజలు
- పాలనలో ప్రజాభిప్రాయానికి విలువ తగ్గుతోందా?
- ప్రశ్నించే గొంతులు మౌనమవుతున్నాయా?

ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేతుల్లో అధికారమన్న భావన. కానీ నేటి పరిస్థితుల్లో ఆ భావన క్రమంగా అర్థం కోల్పోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో ప్రజలు అత్యంత కీలకంగా మారుతారు, ఓటు అనే ఆయుధంతో పాలకులను ఎన్నుకుంటారు. కానీ ఎన్నికలు పూర్తయ్యాక ప్రజల పాత్ర క్రమంగా మసకబారుతోంది. ప్రజలు కేవలం ఓటర్లుగా మాత్రమే మిగిలిపోతూ, పాలనలో భాగస్వాములుగా ఉండాల్సిన స్థానం కోల్పోతున్నారా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రజా చర్చల్లో ప్రధానంగా మారింది.

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి ఉన్న ప్రాధాన్యం క్రమంగా తగ్గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై చర్చలు, గ్రామసభలు, ప్రజావేదికలు ఒకప్పుడు పాలనకు దిశానిర్దేశం చేసేవి. కానీ ఇప్పుడు విధానాలు కొద్దిమంది నిర్ణయకర్తల చేతుల్లోనే పరిమితమవుతున్నాయన్న భావన బలపడుతోంది. ప్రజల అవసరాలు, ఆవేదనలు, సూచనలు పక్కనపెట్టి గణాంకాలు, నివేదికల ఆధారంగానే పాలన సాగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది. ప్రజలు నేరుగా మాట్లాడే వేదికలు క్షీణించడంతో ప్రజాభిప్రాయం పాలనకు చేరే మార్గాలు కూడా సంకుచితమవుతున్నాయి.

ప్రజాస్వామ్యానికి ప్రశ్నించే స్వరం ప్రాణం. కానీ నేడు ప్రశ్నలు వేయడమే నేరమవుతున్నట్లా? అన్న సందేహం ప్రజల్లో కలుగుతోంది. నిరసన తెలిపినా, అభ్యంతరం వ్యక్తం చేసినా, విమర్శించినా అనేక సందర్భాల్లో ప్రజలు ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారన్న భావన ఉంది. ఈ పరిస్థితులు ప్రజలను మౌనంగా మారుస్తున్నాయి. ప్రజలు మాట్లాడకుండా ఉండటానికే భయపడితే, ప్రజాస్వామ్య వ్యవస్థ లోపల నుంచే బలహీనపడుతుంది. ప్రజల మౌనం పాలనకు సౌకర్యంగా మారినా, ప్రజాస్వామ్యానికి అది ప్రమాదకర పరిణామమే.

ప్రజాస్వామ్యం నిలవాలంటే ప్రజల పాత్రను తిరిగి కేంద్రబిందువుగా మార్చాల్సిన అవసరం ఉంది. ఓటు హక్కుతో పాటు పాలనపై ప్రశ్నించే హక్కు, అభిప్రాయం వ్యక్తపరిచే స్వేచ్ఛ, నిర్ణయ ప్రక్రియల్లో భాగస్వామ్యం ఇవన్నీ సమానంగా ఉండాలి. ప్రజల స్వరం బలపడినప్పుడే ప్రజాస్వామ్యం జీవంతంగా ఉంటుంది. ప్రజలు కేవలం ఓటర్లుగా కాకుండా, పాలనకు దిశానిర్దేశం చేసే శక్తిగా మారినప్పుడే ప్రజాస్వామ్యం తన అసలైన అర్థాన్ని తిరిగి పొందుతుంది.

ఆదివారం - 18 - జనవరి 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ ముచ్చట్లు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు
- విజేతలకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేత

**హన్మకొండ,జనవరి17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ముగ్గుల కళను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గులలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.
ఎంపికైన విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది.ప్రథమ బహుమతిని గుర్రపు యాదలక్ష్మి (జి.వై. లక్ష్మి) సాధించగా, ద్వితీయ బహుమతిని వేమునూరి మీనా, తృతీయ బహుమతిని పెసరు ప్రణవి అందుకున్నారు.అలాగే ప్రత్యేక ప్రోత్సాహకంగా నాలుగు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ బహుమతులు సారా సంధ్య, కళ్లెం నవ్య, కర్రె మౌనశ్రీ, జె. అక్షయలకు లభించాయి.ఈ సందర్భంగా తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక చీఫ్ ఎడిటర్ బొల్లెపాక రాజేష్ విజేతలందరికీ అభినందనలు తెలియజేస్తూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సంప్రదాయ కళలకు మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.



గుర్రపు యాదలక్ష్మి (జి వై లక్ష్మి)
ప్రథమ బహుమతి విజేత



వేమునూరి మీనా
(ద్వితీయ బహుమతి) విజేత



పెసరు ప్రణవి
తృతీయ బహుమతి విజేత



కన్సోలేషన్ బహుమతులు అందుకున్న
విజేతలు: సారా సంధ్య



కళ్లెం నవ్య



కర్రే మౌన శ్రీ





# భాగీరథపురంలో నీటి కలుషిత ఘటన బాధిత కుటుంబాలను పరామర్శించిన రాహుల్ గాంధీ

- ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు భరోసా
- ఇది కేవలం ప్రమాదం కాదు – పాలనా వైఫల్యం అని వ్యాఖ్య
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం



మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని భాగీరథపురంలో చోటుచేసుకున్న భయానక నీటి కలుషిత ఘటనలో బాధితులైన కుటుంబాలను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. ఈ ఘటనలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి ఇళ్లకు వెళ్లి, వారి వేదనను స్వయంగా వినిపించుకున్నారు.
బాధిత కుటుంబాలతో మమేకమై మాట్లాడిన రాహుల్ గాంధీ, వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధితుల స్వరం ఎప్పటికీ మౌనమయ్యేలా చేయబోమని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఇది కేవలం ఒక దుర్ఘటన మాత్రమే కాదని, స్పష్టమైన పాలనా వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.
బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రతి బాధిత కుటుంబానికి న్యాయం, బాధ్యత, గౌరవం కల్పించేందుకు తాము అచంచలంగా నిలబడతామని తెలిపారు.

# ఫార్వర్డ్ ఆపరేషనల్ ప్రాంతాలను సందర్శించిన ఐటిబీపీ ఐజీ అమితాబ్ గుప్తా



- సైనికులతో నేరుగా మమేకమైన సీనియర్ అధికారి
- హిమ్‌వీర్ల మనోధైర్యం, అంకితభావానికి ప్రశంసలు
- కఠిన పరిస్థితుల్లోనూ అప్రమత్తత కీలకం అని సూచన

ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబీపీ) నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి అమితాబ్ గుప్తా ఫార్వర్డ్ ఆపరేషనల్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న దళాలతో నేరుగా మమేకమై పరిస్థితులను సమీక్షించారు.
ముందుభాగ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ఆపరేషనల్ సన్నద్ధతపై ఆయన అవగాహన పొందారు. కఠినమైన భౌగోళిక పరిస్థితులు, ప్రతికూల వాతావరణంలోనూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు.
భద్రతా విధుల్లో నిమగ్నమైన హిమ్‌వీర్లతో సంభాషించిన అమితాబ్ గుప్తా, వారి ఉన్నత మనోధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. దేశ భద్రతకు వారు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.
ఫార్వర్డ్ ప్రాంతాల్లో ఎల్లప్పుడూ అప్రమత్తత, బాధ్యతాయుత ప్రవర్తన అవసరమని ఆయన సూచించారు. ఐటిబీపీ దళాల వృత్తిపరమైన నిబద్ధతే సరిహద్దుల భద్రతకు బలమైన ఆధారమని అమితాబ్ గుప్తా స్పష్టం చేశారు.



# పశ్చిమ బెంగాల్‌లో జనాభా సమతుల్యత దెబ్బతింటోంది

## ప్రధాని మోదీ



- మాట్లాడే భాషలోనూ మార్పులు వస్తున్నాయని వ్యాఖ్య
- చొరబాటుదారుల పెరుగుదలతో అల్లర్లు జరుగుతున్నాయన్న ఆరోపణ
- మాల్దా, ముర్షిదాబాద్ ప్రాంతాలను ఉదాహరణగా ప్రస్తావన

పశ్చిమ బెంగాల్‌లో అనేక ప్రాంతాల్లో జనాభా సమతుల్యత తీవ్రంగా దెబ్బతింటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడినప్పుడు, రోజువారీ మాట్లాడే భాషలో కూడా మార్పులు వస్తున్నాయని వారు తనకు చెబుతున్నారని అన్నారు.
చాలా ప్రాంతాల్లో భాష, ఉపభాషల మధ్య తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఇది కేవలం సాంస్కృతిక మార్పు మాత్రమే కాకుండా, రాష్ట్రంలో జరుగుతున్న లోతైన జనసాంఖ్యిక మార్పులకు సంకేతమని వ్యాఖ్యానించారు.
చొరబాటుదారుల సంఖ్య పెరుగుతున్న కారణంగా పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రాంతాల్లో అల్లర్లు మొదలయ్యాయని ప్రధాని ఆరోపించారు. ముఖ్యంగా మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలిపారు.
రాష్ట్రంలో శాంతిభద్రతలు, సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సాంస్కృతిక స్వరూపాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in